


ప్రజాస్వామ్యం గెలిచింది...

అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..


WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -62 బుధవారం 5 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## సమగ్ర అభివృద్ధికి విద్యనే కీలకం

**విసిల సమావేశంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా**



**హైదరాబాద్,ఆగస్టు 4.(జర్నలిస్ట్ వార్త)**
సమగ్ర అభివృద్ధికి విద్యనే కీలకమని రాష్ట్ర గవర్నర్, తెలంగాణ యూనివర్సిటీల చాన్సలర్ శివ్ ప్రతాప్ శుక్లా అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాజభవన్‌లో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీలతో గవర్నర్ ' అకాడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సమావేశం, నషా ముక్తే యువ వికసిత్ భారత్, మై భారత్ పోర్టల్, రెడ్ సోసైటీ తదితర అంశాల్లో విద్యార్థుల భాగస్వామ్యం, పేర్ల నమోదుపై నిర్వహించిన సమావేశంలో ఉన్నత విద్యను సమిక్ష చేసి మాట్లాడారు. యూనివర్సిటీలు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా గ్రామీణ, వెనుకబడిన వర్గాలకు తమ సేవలను విస్తరించాలని సూచించారు. దేశంలో ఉన్న మానవ వనరుల ప్రయోజనాలను **మిగతా 2లో...**

# పరీక్షల నిర్వహణపై ప్రత్యేక నిఘా

**పారదర్శకంగా పోలీస్ ఉద్యోగ నియామకాలు -అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం**

**-హైదరాబాద్ఆగస్టు 4.(జర్నలిస్ట్ వార్త)**
పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్ తో పాటు ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. నియమ, నిబంధనలనుసరించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతో పాటు అన్ని ప్రక్రియల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీని ఆదేశించారు. కోచింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్ సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటలీజెన్స్ విభాగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, డీజీపీ సీవీ ఆనంద్,



హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మెన్ వివి.శ్రీనివాస రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్ బెయిల్

**త్రిషపై వివాదాస్పద వ్యాఖ్యల దుమారం..**



ఉదయనిధి స్టాలిన్‌పై ఆరు సెక్షన్ల కింద కేసు నమోదు
ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టుకు వెళ్లిన డీఎంకే నేత
విచారణకు వచ్చే లోపే అరెస్ట్ చేసిన పోలీసులు
ఉదయనిధి వ్యాఖ్యలపై టీవీకే, బీజేపీ తీవ్ర విమర్శలు.
త్రిషకు క్షమాపణ చెప్పాలని డిమాండ్
వివాదం రాజకీయ ప్రేరేపితమని డీఎంకే వాదన

**చెన్నై ఆగస్టు 4.(జర్నలిస్ట్ వార్త)**
తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఓ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని సృష్టిస్తున్నాయి. ఈ విషయంలో పోలీసులు ఇప్పటికే ఆయన్ను అరెస్ట్ చేశారు. చెన్నైలో ఆయన నివాసానికి పెద్ద ఎత్తున చేరుకున్న డీఎంకే కార్యకర్తలు పోలీసు వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆరు సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు సమాచారం. మరోవైపు అరెస్టు నుంచి రక్షణ కోరుతూ మద్రాస్ హైకోర్టులో ఉదయనిధి ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అది విచారణకు వచ్చేలోపే ఆయన్ను అరెస్ట్ చేయడం గమనార్హం.**మిగతా 2లో...**

## మెగా డీఎస్సీ-2025 పిటిషన్ పై విచారణ మూడు వారాలకు వాయిదా

మెగా డీఎస్సీ-2025పై సీబీఐ విచారణ కోరుతూ హైకోర్టులో పిల్
క్రీడా కోటా నిబంధనలు మార్చి కొందరికి లబ్ధి చేకూర్చారని ఆరోపణ
అనర్హమైన స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో నియామకాలు జరిగాయన్న పిటిషనర్

**అమరావతి ఆగస్టు04 (రిపబ్లిక్ న్యూస్)**
ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ నియామకాల కోసం చేపట్టిన మెగా డీఎస్సీ-2025 ప్రక్రియలో భారీగా అక్రమాలు జరిగాయని, దీనిపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)తో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు **మిగతా 2లో...**






## పోటెత్తుతున్న వరద..

వేగంగా నిండుతున్న శ్రీశైలం డ్యామ్
ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మకు పోటెత్తుతున్న వరద
నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లో 900 క్యూసెక్కులు

## గుజరాత్‌లో చండీపుర వైరస్‌తో 22 మంది మృతి..

15 ఏళ్లలోపు పిల్లలకు ఎక్కువ ప్రమాదం
జ్వరం తర్వాత మెదడుపై దాడి చేసే అవకాశం
టీకా, ప్రత్యేక మందు ప్రస్తుతం లేవు
లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి
కీటకాల నుంచి రక్షణే ప్రధాన నివారణ




## పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ

25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం
13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు
కల్తీ మసాలాలలో క్యాన్సర్ వంటి ప్రమాదాలు
కల్తీలపై సిట్ ద్వారా దర్యాప్తు చేపడతాం
ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు
నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి




**హైదరాబాద్,ఆగస్టు 4.(జర్నలిస్ట్ వార్త)**
ఆహార కల్తీకి పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్న హెచ్-ఫాస్ట్ అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించి పెద్ద ఎత్తున మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో పలు చోట్ల తనిఖీలు చేపట్టి 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నట్టు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించి.. 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.**మిగతా 2లో...**

## జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్..

**పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!**

ఆలస్యంగా చేసే రిజిస్ట్రేషన్లకు కఠినమైన నిబంధనలు
రెండేళ్లు దాటితే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు అవసరం
దేశంలో 99 శాతానికి పైగా పెరిగిన జనన, మరణాల నమోదు
గుర్తింపు మోసాలను అరికట్టడమే లక్ష్యమని తెలిపిన కేంద్రం



**ఢిల్లీ ఆగస్టు 4.(జర్నలిస్ట్ వార్త)**
దేశంలో జనన మరణాల నమోదు ప్రక్రియను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026కు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది.**మిగతా 2లో...**

## ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

**ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశం**

**హైదరాబాద్,ఆగస్టు 4.(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-÷బైర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు.**మిగతా 2లో...**



## అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు

**ప్రత్యేక వైద్యసేవలు అందక ప్రజల ఇక్కట్లు**
**కమిషనర్ లేక గాలిలో దీపంలా వైద్యవిధాన పరిషత్**
**సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు**

**హైదరాబాద్,ఆగస్టు 4.(జర్నలిస్ట్ వార్త)**తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన గైనకాలజీ, ఆర్థోపెడిక్, యూరాలజీ, పీడియాట్రిక్ తదితర ప్రత్యేక వైద్య సేవలను అందించే తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిస్థితి కమిషనర్ లేక **మిగతా 2లో...**



అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607 తెలుగు దిన పత్రిక

# మెగా డీఎస్సీ-2025 పిటిషన్ పై విచారణ మూడు వారాలకు వాయిదా

**మొదటి పేజీ తరువాయి**

మంగళవారం విచారణ చేపట్టింది. ఈ నియామక ప్రక్రియలో జరిగిన అవకతవకలు కేవలం కొన్ని పొరపాట్లు కావని, ఇది వ్యవస్థీకృత వైఫల్యమని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు.

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది, రాష్ట్ర మాజీ అడ్వొకేట్ జనరల్ ఎస్. శ్రీరామ్ సుబ్రహ్మణ్యం వాదనలు వినిపించారు. డీఎస్సీ నోటిఫికేషన్‌కు కొద్ది రోజుల ముందు ప్రభుత్వం క్రీడా కోటా విధానంలో కీలక మార్పులు చేసిందని శ్రీరామ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. క్రీడా కోటా రిజర్వేషన్లను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచారని, ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలన్న నిబంధనను కూడా తొలగించారని తెలిపారు. ఈ మార్పుల ద్వారా ముందుగా నిర్ణయించుకున్న కొందరు అభ్యర్థులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా పారదర్శకత లేకుండా వ్యవహరించారని ఆయన ఆరోపించారు.అర్హత లేని స్పోర్ట్స్ సర్టిఫికెట్ల ఆధారంగా పలువురు అభ్యర్థులు నియామకాలు పొందారని, దీనికి సంబంధించిన కొన్ని నమూనా సర్టిఫికెట్లను ఆయన కోర్టు ముందు ఉంచారు. గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు బదులుగా, కేవలం స్థానిక పోటీల్లో పాల్గొన్న సర్టిఫికెట్లను ఉపయోగించారని వాదించారు. ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ప్రభుత్వం క్రీడా కోటాకు సంబంధించిన జీవోలను వెనక్కి తీసుకుందని, ఈ చర్యే విధానపరమైన మార్పులపై తీవ్ర అనుమానాలకు తావిస్తోందని, కాబట్టి స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన పేర్కొన్నారు.సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా తాము చాలా సమాచారాన్ని సేకరించామని, ప్రభుత్వం పూర్తి మెరిట్ జాబితాను ప్రచురించనందున కొన్ని ఉదాహరణలను మాత్రమే కోర్టు ముందు ఉంచగలిగామని వివరించారు. ప్రభుత్వ చర్యలకు, బెదిరింపులకు భయపడి చాలా మంది బాధితులు కోర్టును ఆశ్రయించడం లేదని కూడా ఆయన తెలిపారు. ఈ అంశం వేలాది మంది ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తుకు సంబంధించినది కాబట్టి, వ్యవస్థీకృత లోపాలను సరిదిద్దడానికి ప్రజా ప్రయోజన వ్యాజ్యం ద్వారానే దర్యాప్తు కోరుతున్నామని స్పష్టం చేశారు.వాదనలు విన్న హైకోర్టు, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

# సమగ్ర అభివృద్ధికి విద్యనే కీలకం

**మొదటి పేజీ తరువాయి**

పూర్తిస్థాయిలో అందుకోవాలంటే యువతకు విజ్ఞానంతో పాటు జీవన నైపుణ్యాలు, నైతిక విలువలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిలో భాగంగా ఎంజీయూ వీసీతోపాటు పలువురు వీసీలు మొదటి తరం విద్యార్థులలో ఆరోగ్య అవగాహన, హెచ్ఐవీ నివారణ, రక్తదానం, జీవన నైపుణ్యాల పెంపొందించడంలో రెడ్ రిబ్బన్ క్లబ్ లు కీలక పాత్ర పోషిస్తున్నాయ ప్రస్తావించారు. దీనిలో భాగంగా సమాజ శ్రేయస్సు కోసం ప్రత్యేక ఏఎస్ఆర్ కార్యాచరణ

ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రభుత్వం, పౌర సమాజంతో సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ రాజ్ భవన్ తో సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో వీసీలు నిర్ణయించారు. ÷ూష్ట్రంలో అన్ని యూనివర్సిటీల వీసీలతో నిర్వహించిన సమావేశంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీలో విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఇతర అంశాలను వీసీ ప్రొ.ఖాజా అల్తాఫ్ హుస్సేన్ వివరించారు. దీనిలో భాగంగా ఉన్నత విద్యా రంగానికి విశేష సేవలు అందిస్తున్న సీనియర్ వైస్ చాన్సలర్లలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌కు గవర్నర్ పుష్పగుచ్ఛాలు అందచేసి ఘనంగా సన్మానించి అభినందించారు.

# పోటెత్తుతున్న వరద..

**ఆగస్టు04 (రిపబ్లిక్ న్యూస్)**

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి కృష్ణా నది వరద ప్రవాహం పోటెత్తుతోంది. ఐదు రోజుల క్రితం ప్రవాహం ప్రారంభమైన సమయంలో 820 అడుగులుగా ఉన్న నీటిమట్టం, నిన్న సాయంత్రానికి 855.10 అడుగులకు చేరింది. ప్రస్తుతం డ్యామ్‌లో 92.048 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఈ సాయంత్రానికి ఈ నిల్వలు 100 టీఎంసీల మార్కును దాటుతాయని ప్రాజెక్టు అధికారులు అంచనా వేస్తున్నారు.శ్రీశైలం జలాశయం: జూరాల నుంచి సోమవారం 2.21 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, రాత్రి సమయానికి శ్రీశైలానికి 1.55 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. రోజుకు లక్ష క్యూసెక్కులకు పైగా వచ్చే ఈ వరద ఉధృతి మరో నాలుగైదు రోజులు కొనసాగవచ్చని శ్రీశైలం డ్యామ్ సీఈ కబీర్ బాషా తెలిపారు.ఎగువ కర్ణాటక ప్రాజెక్టులు: ఆలమట్టి డ్యామ్‌లోకి 1,25,855 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు 1.50 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టులోకి 1,28,954 క్యూసెక్కులు వస్తుండగా, 1,40,880 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.జూరాల ... తుంగభద్ర: నారాయణపూర్ నుంచి వస్తున్న నీటికి భీమా నది వరద జలాలు తోడవడంతో జూరాలకు ఏకంగా 1.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వచ్చిన వరదను దృష్టిలో ఉంచుకొని జూరాల నుంచి 2,21,765 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర డ్యామ్‌లోకి 57,785 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 136 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఎగువ నుంచి 900 క్యూసెక్కులు వస్తున్నాయి. పులిచింతలలో 28.91 టీఎంసీల నీటినిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజీలోకి 6,958 క్యూసెక్కులు చేరుతుండగా, 6,499 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

# ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్ బెయిల్

**మొదటి పేజీ తరువాయి**

కావేరి జలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఉదయనిధి నిన్న ప్రసంగించారు. ఆ సమయంలో సభలో ఉన్న ఓ వ్యక్తి నటి త్రిష పేరు ప్రస్తావించగా, దానికి ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు ద్వంద్వార్థంతో ఉన్నాయని విమర్శలు వచ్చాయి. మహిళలను అవమానించేలా ఆ వ్యాఖ్యలు ఉన్నాయని ప్రత్యర్థి పార్టీలు ఆరోపించాయి.అధికార టీవీకే పార్టీ నేత ఆధవ్ అర్జున్ ఉదయనిధిపై తీవ్ర విమర్శలు చేశారు. మహిళల పట్ల అవమానకరంగా మాట్లాడారని ఆరోపించారు. రాజకీయాల స్థాయిని దిగజార్చేలా వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. టీవీకే అధికార ప్రతినిధి ఫెలిక్స్ జెరాల్డ్ కూడా స్పందించారు. అదే వ్యాఖ్యలను తన కుటుంబ సభ్యుల ముందు చెబుతారా? అని ప్రశ్నించారు.బీజేపీ కూడా ఈ వ్యాఖ్యలను ఖండించింది. ఉదయనిధిని వెంటనే అరెస్టు చేయాలని తమిళనాడు బీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి నారాయణన్ తిరుపతి డిమాండ్ చేశారు. రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై కూడా విమర్శలు గుప్పించారు. నటి త్రిషకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ ఉపాధ్యక్షురాలు ఖుష్బూ సుందర్ డిమాండ్ చేశారు. అయితే ఈ వివాదాన్ని డీఎంకే కొట్టిపారేసింది. కావేరి జలాల సమస్య, డెల్టా రైతుల ఇబ్బందుల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ అంశాన్ని పెద్దది చేస్తున్నారని మాజీ మంత్రి టీ. మనో తంగరాజ్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఉదయనిధి ప్రశ్నించకుండా అడ్డుకునేందుకే ఈ ప్రచారం జరుగుతోందని అన్నారు.

## ఉదయనిధికి హైకోర్టులో ఊరట.. బెయిల్ మంజూరు


తమిళనాడు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ఈరోజే విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. అలాగే విచారణకు పూర్తిగా సహకరించాలని ఉదయనిధికి సూచించింది.

ఈ నేపథ్యంలో బెయిల్ కోసం ఆయన హైకోర్టును ఆశ్రయించారు.ఉదయనిధిని రిమాండ్‌కు పంపే ఆలోచన తమకు లేదని తమిళనాడు పోలీసులు స్పష్టం చేశారు. ఎఫ్ఐఆర్ నమోదైన నేపథ్యంలో మాత్రమే ఆయన్ను విచారిస్తున్నామని తెలిపారు. విచారణ పూర్తైన వెంటనే విడుదల చేస్తామని కూడా వెల్లడించారు.

# గుజరాత్‌లో చండీపుర వైరస్‌తో 22 మంది మృతి..

**ఆగస్టు 4.(జర్నలిస్ట్ వార్త)**

గుజరాత్‌లో చండీపుర వైరస్ మరోసారి కలకలం రేపుతోంది. ఈ వైరస్ కారణంగా ఇప్పటివరకు 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. మరో 35 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. సాధారణ జ్వరంలా మొదలయ్యే ఈ ఇన్‌ఫెక్షన్ కొన్ని గంటల్లోనే మెదడుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అసలు చండీపుర వైరస్ అంటే ఏంటి? ఇది ఎలా వ్యాపిస్తుంది? లక్షణాలు ఏంటి? చికిత్స ఉందా? తెలుసుకుందాం..



## ఏంటీ వైరస్?

రాబ్డోవిరిడే కుటుంబానికి చెందినదే ఈ చండీపుర వైరస్ (సీహెచ్‌పీవీ). దీన్ని తొలిసారి 1965లో భారత్‌లో గుర్తించారు. వర్షాకాలంలో ఎక్కువగా కనిపించే శాండ్‌ఫ్లై (ఇసుక ఈగ) వల్ల ఇది వ్యాపిస్తుంది. మనుషుల నుంచి మనుషులకు ఈ వైరస్ సోకినట్లు ఇప్పటివరకు ఆధారాలు లేవు.

## ఎవరికి ఎక్కువ ప్రమాదం?

ఈ వైరస్ ఎక్కువగా 15 ఏళ్లలోపు చిన్నారులపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, శాండ్‌ఫ్లైలు ఎక్కువగా ఉండే చోట్ల ప్రమాదం అధికంగా ఉంటుంది. వర్షాకాలంలో ఈగల సంఖ్య పెరగడంతో వైరస్ వ్యాప్తి కూడా ఎక్కువగా కనిపిస్తుంది.

## మొదట కనిపించే లక్షణాలు ఏవి?

ప్రారంభంలో ఈ వైరస్‌ను గుర్తించడం కాస్త కష్టం. ఎందుకంటే మొదట సాధారణ వైరల్ జ్వరంలాగే కనిపిస్తుంది. జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం, ఫ్లూ లక్షణాలు ఉంటాయి. ఈ దశలో చాలామంది సాధారణ జ్వరంగా భావించే అవకాశం ఉంటుంది.

## ఎందుకు ప్రమాదకరం?

కొంతమంది చిన్నారుల్లో వైరస్ చాలా వేగంగా మెదడుపై దాడి చేస్తుంది. దీంతో మెదడు వాపు (ఎన్‌సెఫలైటిస్) వస్తుంది. ఆ తర్వాత పరిస్థితి గంటల వ్యవధిలోనే విషమించవచ్చు.

## తీవ్రమైన లక్షణాలు ఇవీ..

మూర్ఛ, స్పృహ కోల్పోవడం, కోమాలోకి వెళ్లడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందుల వంటి తీవ్రమైన లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని కేసుల్లో ఆసుపత్రిలో చేరిన 48 నుంచి 72 గంటల్లోనే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

## చికిత్స ఉందా?

ప్రస్తుతం చండీపుర వైరస్‌కు ప్రత్యేకంగా పనిచేసే మందు లేదు. టీకా కూడా అందుబాటులో లేదు. రోగికి కనిపించే లక్షణాలను బట్టి చికిత్స అందిస్తారు. శ్వాస, రక్తపోటు వంటి కీలక అవయవాల పనితీరును నిలకడగా ఉంచే ప్రయత్నం చేస్తారు. అందుకే లక్షణాలు కనిపించగానే ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లడం కీలకం.

## ఎలా జాగ్రత్త పడాలి?

చండీపుర వైరస్‌కు ప్రత్యేక టీకా లేకపోవడంతో నివారణే ఉత్తమ మార్గం. శాండ్‌ఫ్లై కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలకు పూర్తి చేతులు కవర్ అయ్యేలా దుస్తులు వేయాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కీటకనాశక ద్రావణాలు, దోమతెరలు ఉపయోగించాలి. జ్వరం, వాంతులు, మూర్ఛలు కనిపిస్తే వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి.

## ఎందుకు అప్రమత్తంగా ఉండాలి?

చండీపుర వైరస్ చాలా అరుదుగా కనిపించినా, ఒకసారి సోకితే వేగంగా తీవ్ర స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది. అందుకే పిల్లల్లో సాధారణ జ్వరంతో పాటు నాడీ సంబంధిత లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**'అమరజీవి జలధార' గోదావరి జిల్లాల తాగునీటి సమస్యకు పరిష్కారం: పవన్ కల్యాణ్**

**జల్ జీవన్ మిషన్ కింద అమలవుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు**

**తీరప్రాంతాల్లోని 33 లక్షల మందికి సురక్షిత మంచినీటిని అందించడమే లక్ష్యం**

**నిర్దేశిత వ్యవధిలోనే నిర్మాణాలను పూర్తి చేయాలన్న పవన్**

**అమరావతి ఆగస్టు 4.(జర్నలిస్ట్ వార్త)**

జల్ జీవన్ మిషన్ కింద చేపడుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఈ ప్రాజెక్టు

పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

తీరప్రాంతాల్లోని దాదాపు 33 లక్షల మంది ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు పవన్ వివరించారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు స్పష్టం చేశారు. నిర్దేశిత వ్యవధిలోనే కీలక నిర్మాణాలను పూర్తి చేసి, ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. తీరప్రాంత ప్రజల తాగునీటి భద్రతను నిర్ధారించడంలో జల్ జీవన్ మిషన్ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొనియాడారు.

# జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్..

**మొదటి పేజీ తరువాయి**

లోక్‌సభలో ఇదివరకే ఆమోదం పొందిన ఈ బిల్లు, త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు.తాజా సవరణల ప్రకారం, జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యంగా నమోదు చేయాలంటే కఠిన నిబంధనలు వర్తిస్తాయి. ఘటన (పుట్టిన లేదా మరణించిన) జరిగిన ఏడాది తర్వాత (రెండేళ్ల లోపు) నమోదు చేయాల్సి వస్తే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటిన పక్షంలో, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.ఈ సందర్భంగా మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, జనన మరణాలను నిర్ణీత సమయంలోగా నమోదు చేయడాన్ని ప్రోత్సహించడంతో పాటు, తప్పుడు సమాచారం, అవకతవకలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3.5 లక్షల రిజిస్ట్రేషన్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 2014లో 86.6 శాతంగా ఉన్న జననాల నమోదు 2024 నాటికి 99 శాతానికి పైగా చేరిందని ఆయన వివరించారు. అదేవిధంగా మరణాల నమోదు 72.5 శాతం నుంచి 99.4 శాతానికి పెరిగిందని మంత్రి వెల్లడించారు.బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా బీజేపీ ఎంపీ దర్శన సింగ్ మాట్లాడుతూ, ఈ కొత్త సవరణలు వ్యవస్థను మరింత సరళంగా, పారదర్శకంగా మారుస్తాయని కొనియాడారు. అయితే, రెండేళ్ల తర్వాత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలనే నిబంధనపై బీజేడీ ఎంపీ డాక్టర్ సంతృప్త్ మిశ్రా కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇప్పటికే పనిభారంతో ఉన్న న్యాయస్థానాలపై మరింత ఒత్తిడి పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, అన్నాడీఎంకే సహా పలు పార్టీల సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలిపారు.

# పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ

**మొదటి పేజీ తరువాయి**

3 క్రిమినల్ కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, టాల్కమ్ పౌడర్లు, ఇండస్ట్రియల్ కలర్స్, రైస్ బ్రాన్ అయిల్ నకిలీ మసాలాల్లో వినియోగించినట్టు గుర్తించామన్నారు. కల్తీ మసాలాల వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. కల్తీ ఆహార పదార్థాల కేసులపై త్వరలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేస్తామని సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు

హైదరాబాద్ కల్తీ మసాలా తయారీముఠా కేసులో హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రకటించారు. ప్రమాదకర రసాయనాలతో టన్నుల మసాలా దినుసులను తెలుగు రాష్ట్రాలకు ఈ ముఠా సరఫరా చేస్తోందని తెలిపారు. సిట్ ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై హెచ్ -ఫాస్ట్ మెరుపు దాడులు చేసిందని సీపీ పేర్కొన్నారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ప్రజల సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పుకొచ్చారు. 25 టన్నులకుపైగా కల్తీ మసాలాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కల్తీ మసాలాల కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశామని అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు సహా పలు మసాలాల్లో కల్తీ చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్‌తో మసాలాలు తయారీ చేస్తున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మసాలాలకు మెరుపు కోసం హానికర రసాయనాలను వినియోగిస్తున్నారని తెలిపారు. రంగులు వేసి నాణ్యమైన మసాలాల మాదిరిగా విక్రయిస్తున్నారని చెప్పుకొచ్చారు. 89 టన్నులకుపైగా ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ మసాలాల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపామని వెల్లడించారు. కల్తీ ఆహారం వల్ల కాలేయం, మూత్రపిండాలకు ముప్పు పొంచి ఉందని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మసాలాలతో క్యాన్సర్, అలర్జీలు, జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ-ఈం÷ు ఏర్పడిన 140 రోజుల్లో 659 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని అన్నారు. 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 246 టన్నుల కల్తీ ఆహారాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రజలు

అనుమానాస్పద ఆహారంపై వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

**మొదటి పేజీ తరువాయి**

సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ్గ-÷బైర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ్గ-÷బైర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

# అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు

**మొదటి పేజీ తరువాయి**

గాలిలో దీపంలా మారడం శోచనీయమని తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హరీశ్‌రావు పోస్టుపెట్టారు. గత రెండు నెలలుగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ÷ఎఖ పరిధిలోని ఎంసీహెచ్, జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్సీ మొత్తంగా 184 ఆస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత తదితర అంశాలను పర్యవేక్షించే అధికార యంత్రాంగమే లేకుండా పోయిందని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. దీంతో ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ పాలనలో ప్రజలు సరైన వైద్య సేవలు అందక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది వేతనాలు, సర్వీస్ సమస్యలు సహా ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ÷ఎఖని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని తమ హయాంలో నిర్ణయించామని ప్రస్తావించారు. దాదాపు మూడేళ్లు గడుస్తున్నా సర్వీసు నిబంధనలు రూపొందించక పోవడం, లక్ష్యం కార్యరూపం దాల్చకపోవడం దురదృష్టకరమని హరీశ్‌రావు అన్నారు. దీంతో వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారని చెప్పుకొచ్చారు. ఇదే విషయమై ఉద్యోగులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండా పోతుందని తెలిపారు. రో÷-లడెక్కి నిరసనలు తెలియచేస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. వెంటనే డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి వెంటనే కమిటీ వేసి సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని, తక్షణమే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# ఉన్న రోడ్డుపైనే మరో సీసీ..!

## ఎస్సీ కాలనీకి మాత్రం నిర్లక్ష్యం..!

- పూర్తికాని రహదారిని వదిలేసి ఇప్పటికే ఉన్న రోడ్డుపై మళ్లీ నిర్మాణం
- ప్రజాధనం వృథా చేస్తున్నారంటూ గ్రామస్థుల ఆగ్రహం
- నిబంధనలు గాలికొదిలి నాసిరకం పనులంటూ ఆరోపణలు
- ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఎస్సీ కాలనీలో గత పాలకవర్గం ప్రభుత్వ నిధులతో సీసీ రహదారిని నిర్మించినప్పటికీ, బడ్జెట్ కొరత కారణంగా ప్రజలు నివసించే ప్రాంతంలోని కొంత భాగం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆ మిగిలిన రహదారిని పూర్తి చేయకుండా, ఇప్పటికే సీసీ రోడ్డు ఉన్న మరో వీధిపైనే మళ్లీ సీసీ రోడ్డు నిర్మిస్తుండటం ప్రజాధనం దుర్వినియోగమేనని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ముందుగా మౌలిక సదుపాయాలు కల్పించాలని స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తున్నప్పటికీ, ధర్మసాగర్ గ్రామపంచాయతీలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన ప్రాంతాలను విస్మరించి, ఇప్పటికే రహదారి ఉన్న చోట మరోసారి సీసీ రోడ్డు వేయడం వెనుక కారణమేంటని ప్రశ్నిస్తున్నారు.గ్రామంలో లక్షల రూపాయలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నప్పటికీ, ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని ఆరోపిస్తున్నారు. సీసీ రోడ్డు ఇరువైపులా మట్టి వేసి రహదారికి బలాన్ని కల్పించాల్సిన నిబంధనను అమలు చేయడం లేదని, దీంతో రోడ్డు అంచులు త్వరగా దెబ్బతిని రెండుమూడు సంవత్సరాల్లోనే రహదారి శిథిలావస్థకు చేరే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. నాణ్యతా ప్రమాణాలను విస్మరించి పనులు చేపడితే ప్రజాధనం వృథా కావడం తప్ప ప్రజలకు ప్రయోజనం ఉండదని అంటున్నారు.
ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే వీధులకు ప్రాధాన్యం ఇచ్చి, ఎస్సీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న రహదారిని ముందుగా పూర్తి చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో చేపడుతున్న సీసీ రోడ్ల పనులపై జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఏఈ వివరణ**

ఈ విషయమై ధర్మసాగర్ మండల పంచాయతీరాజ్ శాఖ సహాయ ఇంజనీర్‌ను వివరణ కోరగా, సీసీ రోడ్లకు ఇరువైపులా తప్పనిసరిగా మట్టి వేయాలని కాంట్రాక్టర్లకు సూచించామని తెలిపారు. నిబంధనల ప్రకారం పనులు పూర్తయిన తర్వాతే బిల్లులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అయితే క్షేత్రస్థాయిలో ఆ నిబంధనలు అమలవుతున్నాయా లేదా అన్నది పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు కోరుతున్నారు.

# కిష్టారం సమస్యలపై బీజేపీ సమరశంఖం

సైలోబంకర్ కాలుష్యంతో ప్రజలు విలవిల.. పునరావాసం ఎక్కడ? -గ్రామంలో పర్యటించిన బీజేపీ నేతలు.. ప్రభుత్వంపై విమర్శలు





**సత్తుపల్లి/ ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):** సింగరేణి ప్రభావిత కిష్టారం గ్రామ ప్రజల సమస్యలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. సత్తుపల్లి రూరల్ మండలంలోని కిష్టారం గ్రామంలో మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు సాలి శివకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ బృందం పర్యటించి గ్రామస్తుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంది.ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ల వీరంరాజు, నాయకుడు పడిగల మధుసూదన్‌రావు గ్రామస్తులతో మాట్లాడి వారి ఆవేదనను తెలుసుకున్నారు. గ్రామానికి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన సైలోబంకర్ నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి కారణంగా పలువురు ఊపిరితిత్తుల వ్యాధులతో మృతి చెందారని, మరికొందరు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని గ్రామస్థులు వివరించారు. భర్తను కోల్పోయి, ప్రస్తుతం కుమారుడు కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధులతో చికిత్స పొందుతున్న దివ్యాంగురాలు బొర్రా రజనిని బీజేపీ నాయకులు పరామర్శించారు.గతంలో గ్రామస్థులు ఆందోళన చేపట్టిన సమయంలో నెల రోజుల్లో పునరావాసం కల్పిస్తామని ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదని గ్రామస్థులు వాపోయారు. వర్షాకాలంలో పారిశుధ్య పనులు నిలిచిపోవడంతో డ్రైనేజీలు మురుగునీటితో నిండిపోయి విషజ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. సింగరేణి సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన తాగునీటి ప్లాంట్లు మూడేళ్లుగా ప్రారంభం కాకపోవడంతో కలుషిత నీటినే తాగాల్సి వస్తోందని, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కూడా అర్ధాంతరంగా నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా భాస్కర్ల వీరంరాజు, పడిగల మధుసూదన్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వాల మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా సింగరేణి ప్రభావిత గ్రామాల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కిష్టారం గ్రామానికి తక్షణమే శాశ్వత పునరావాసం కల్పించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రెహ్మాతుల్లా, సుందరం తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో హెచ్‌ఆర్‌సీసీఐ జిల్లా కార్యాలయం ప్రారంభం

## సేవాభావంతో పనిచేసే వారికే సంస్థలో స్థానం సింగమల వెంకటరమణయ్య




**ఖమ్మం/ ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):** మానవ హక్కుల పరిరక్షణ సంస్థ (హెచ్‌ఆర్‌సీసీఐ) ఖమ్మం జిల్లా నూతన కార్యాలయాన్ని మంగళవారం ఖమ్మం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోని ఇల్లందు రోడ్డులో ఘనంగా ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సింగమల వెంకటరమణయ్య ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ కోసం సేవా దృక్పథంతో పనిచేసే వ్యక్తులకే సంస్థలో చోటు ఉంటుందని స్పష్టం చేశారు. పదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజ సేవ లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. సంస్థ నియమ నిబంధనలను ప్రతి సభ్యుడు తూచా తప్పకుండా పాటిస్తూ ప్రజల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో హెచ్‌ఆర్‌సీసీఐ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కిషోర్ కుమార్, వర్కింగ్ చైర్మన్ బెస్త సంజీవరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోటపోతుల బాబురావు, రాష్ట్ర మహిళా చైర్మన్ పాదం అజంతా, రాష్ట్ర కార్యదర్శి సంకా గణేష్ కుమార్ మాట్లాడుతూ సంస్థ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని కోరారు.జిల్లా చైర్మన్ పుచ్చకాయల దేవేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చిలకబత్తిన కనకయ్య, సయ్యద్ షారుక్ ఇమ్రాన్, కొప్పుల రామకృష్ణ, వరప్రసాద్, గుర్రం మనోజ్, నవీన్, నాగేశ్వరరావు, బొమ్మల శంకర్, అవినాష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎలుగుబంటి వేట కేసులో మరో ఇద్దరు అరెస్ట్

**ప్రత్యేక గాలింపుతో పట్టుకున్న అటవీశాఖ..**

**నిందితులకు 11 రోజుల రిమాండ్**




**తల్లాడ/ ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):** కల్లూరు అటవీ సెక్షన్‌లో విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ఎలుగుబంటిని వేటాడిన కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను తల్లాడ అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. ప్రత్యేక గాలింపు చేపట్టిన అధికారులు నిందితులను అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపర్చగా, 11 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.తల్లాడ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ఇటీవల వెలుగులోకి వచ్చిన ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసి సత్తుపల్లి న్యాయస్థానంలో హాజరుపర్చగా, వారికి 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. పరారీలో ఉన్న కొత్తబోడు మల్లె గ్రామానికి చెందిన అజ్మీర కృష్ణ, లోకారం గ్రామానికి చెందిన ఏనుగంటి రామకృష్ణ కోసం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి. ఉమా ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ముమ్మర గాలింపు చేపట్టాయి. సోమవారం వారిని అదుపులోకి తీసుకుని సత్తుపల్లి న్యాయస్థానంలో హాజరుపర్చగా, న్యాయమూర్తి 11 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. అనంతరం వారిని ఖమ్మం జిల్లా జైలుకు తరలించారు.
ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి. ఉమా మాట్లాడుతూ అటవీ జంతువుల వేట, విద్యుత్ తీగల ఏర్పాటు వంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. అటవీ, వన్యప్రాణి సంరక్షణ చట్టాల ప్రకారం నేరస్తులను ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.అరెస్టు ఆపరేషన్‌లో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి. సురేష్ కుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రమేష్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు నక్క రమేష్, అజమ్ అలీ, తెనాలి శ్రీను, తేజావద్ కృష్ణ, అంజద్ పాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాసర సీటు సాధించిన విద్యార్థికి రూ.25 వేల చేయూత

పూర్వ విద్యార్థుల అభినందన.. ఉన్నత విద్యకు అండగా నిలిచిన దాతలు



**వైరా/ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):** ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించిన విద్యార్థికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. వైరా మండలం సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి ట్రిపుల్ ఐటీ బాసరలో సీటు సాధించిన కంభంపాటి ఆదిత్య నిరుపేద కుటుంబానికి చెందినవాడని తెలుసుకున్న తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 199091 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు.మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సరికొండ అప్పలరాజు, పఠాన్ రహీం, చింతల కృష్ణయ్య విద్యార్థికి నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఈ సాయం అందించినట్లు తెలిపారు. ఆదిత్య ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు, సమాజానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫిజిక్స్ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



**నర్సంపేట/ ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో 202627 విద్యా సంవత్సరానికి భౌతిక శాస్త్ర విభాగంలో ఖాళీగా ఉన్న ఒక అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మంగళవారం తెలిపారు.సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణులై ఉండాలని, ఓసీ, బీసీ అభ్యర్థులు కనీసం 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్, స్లెట్ అర్హతలు, బోధన అనుభవం ఉన్న వారికి ఎంపికలో ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు.ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు విద్యార్హతల ధ్రువపత్రాల ప్రతులను జతచేసి ఈ నెల 11వ తేదీ సాయంత్రం 3 గంటలలోపు కళాశాల కార్యాలయంలో సమర్పించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## డయల్ యువర్ ఎమ్మెల్యే కు శ్రీకారం

ఫోన్‌లో ప్రజల సమస్యలపై ఆరా.. అధికారులకు వెంటనే ఆదేశాలు




**అశ్వారావుపేట/ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):** ప్రజలకు మరింత చేరువయ్యే లక్ష్యంతో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.తాగునీరు, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాల అమలు, రెవెన్యూ తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించిన ఎమ్మెల్యే, వాటిపై వెంటనే స్పందించారు. సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా తనతో మాట్లాడేందుకు ఈ కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రతి ఫిర్యాదుపై వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజల సంక్షేమం, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన ధ్యేయమని, ప్రతి సమస్యను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

6న చలో ఇందిరా పార్క్ మహాధర్నాను విజయవంతం చేయండి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ పిలుపు



**హసన్‌పర్తి/పరకాల, ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలోని విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ డిమాండ్ చేశారు. ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే చలో ఇందిరా పార్క్ మహాధర్నాను విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
మంగళవారం పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.10 వేల కోట్ల మేర స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.ఫీజు బకాయిల పేరుతో ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల విద్యా ధ్రువపత్రాలను నిలిపివేయడం చట్టవిరుద్ధమని, అలాంటి యాజమాన్యాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న మహాధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ పరకాల పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ హేమంత్, సన్నీ, నాయకులు అజయ్, విజయ్, అరుణ్‌కుమార్, సందీప్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభకు చేయూతగా రూ.25 వేల సాయం

**ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన నిరుపేద విద్యార్థికి పూర్వ విద్యార్థుల అండ**



**వైరా/ ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):** ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు అడ్డంకిగా మారకూడదనే సంకల్పంతో పూర్వ విద్యార్థులు ఓ నిరుపేద విద్యార్థికి అండగా నిలిచారు. వైరా మండలం సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి ట్రిపుల్ ఐటీ బాసరలో సీటు సాధించిన కంభంపాటి ఆదిత్యకు రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.నిరుపేద కుటుంబానికి చెందిన ఆదిత్య ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఆర్థిక సహాయం అవసరమని తెలుసుకున్న తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 199091 బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.25 వేల చెక్కును అందజేశారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు సమాజం అండగా నిలిస్తే వారు ఉన్నత శిఖరాలను చేరుకుంటారని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు సరికొండ అప్పలరాజు, పఠాన్ రహీం, చింతల కృష్ణయ్యతో పాటు వారి మిత్రులు పాల్గొని ఆదిత్యకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉన్నత విద్యను పూర్తిచేసి కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# పట్టాల్లేక రైతులకు ఇబ్బందులు.. సమస్యలు పరిష్కరించాలి

**సబ్ కలెక్టర్‌కు సర్పంచ్ నేతృత్వంలో వినతి**



**బెల్లంపల్లి/ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):** బెల్లంపల్లి మండలంలోని బుచ్చయ్యపల్లి, ఆకనపల్లి గ్రామపంచాయతీల పరిధిలో భూముల పట్టాల సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బుచ్చయ్యపల్లి గ్రామ సర్పంచ్ జాడి మహేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. గోన వెంకట ముత్యాలరావుకు సంబంధించిన భూములు, ప్రభుత్వ (పీపీ) భూముల వివాదాల కారణంగా పలువురు రైతులకు పట్టాలు మంజూరు కాకపోవడంతో వ్యవసాయ అవసరాలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు.ఈ నేపథ్యంలో రైతుల తరఫున బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. పట్టాలు లేకపోవడంతో యూరియా, డీఏపీ, పొటాష్ వంటి ఎరువులను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోలేకపోతున్నారని, పంటల నమోదులో సమస్యలు తలెత్తడంతో వరి, పత్తి దిగుబడులను విక్రయించడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వినతిలో వివరించారు.వినతిపై స్పందించిన సబ్ కలెక్టర్ మనోజ్ జిల్లా వ్యవసాయ అధికారితో ఫోన్‌లో మాట్లాడి రైతులు సాగు చేస్తున్న ప్రతి పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు ఎరువుల ఆన్‌లైన్ బుకింగ్‌లో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను సూచించారు.ఈ కార్యక్రమంలో రైతులు కర్ణాటక ఓదేలు, బుడిమే ఓదేలు, బండి మల్లేష్, సాగర్ల శ్రీను, శివకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# చివరి శ్వాస వరకూ సేవే ధ్యేయం..

# ఇప్పుడు జ్ఞాపకాలే మిగిలాయి

**చాలీచాలని జీతంతో నలుగురు కుమార్తెలను ఉన్నత స్థాయికి చేర్చిన తండ్రి...**

**కార్మికుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన పింగిలి శ్రీనివాస్‌రెడ్డి**

**ధర్మసాగర్‌లో నేడుదశదిన కర్మ.. కన్నీటి నివాళులర్పిస్తున్న గ్రామం**



స్వర్గస్తులైన శ్రీనివాసరెడ్డి కూతుళ్లు



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):** జీవితమంతా కష్టాలే.చేతికి వచ్చే జీతం కుటుంబ అవసరాలకు కూడా సరిపోని పరిస్థితి. అయినా ఒక్కరోజు కూడా తన బాధను బయటపెట్టలేదు. తన కోసం కాదు.భార్య, నలుగురు కుమార్తెల భవిష్యత్తు కోసం ప్రతి రూపాయిని దాచాడు. గ్రామ ప్రజల కోసం, తనతో కలిసి పనిచేసేగ్రామపంచాయతీ సిబ్బంది కోసం అధికారుల ఎదుట ధైర్యంగా నిలబడ్డాడు. అలాంటి నిరాడంబరుడు, ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీలో 33 సంవత్సరాల పాటు కరోబార్‌గా సేవలందించిన పింగిలి శ్రీనివాస్‌రెడ్డి ఇక లేరనే వార్త ధర్మసాగర్ ప్రజలను తీవ్ర విషాదంలోకి నెట్టింది.శ్రీనివాస్‌రెడ్డి పేరు చెబితే గ్రామంలో ఇప్పటికీ చాలామంది కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. చిరునవ్వుతో పలకరించే స్వభావం, ఎవరికైనా కష్టం వస్తే ముందుగా స్పందించే మనసు, తన సమస్యల కంటే ఇతరుల బాధలనే ఎక్కువగా పట్టించుకునే వ్యక్తిగా ఆయన గుర్తుండిపోయారని గ్రామస్తులు చెబుతున్నారు.ఉద్యోగిగా మాత్రమే కాదు.ధర్మసాగర్ ఉమ్మడి మండల పంచాయతీ యూనియన్ నాయకుడిగా కూడా గ్రామపంచాయతీ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడారు. అరకొర వేతనాలతో పనిచేస్తున్న గ్రామ సిబ్బందికి న్యాయం చేయాలని అధికారులను పలుమార్లు నిలదీశారు. వేతనాల పెంపు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జరిగిన ధర్నాలు, నిరసనల్లో ముందుండి పోరాడారు. కార్మికులకు ఆపదలో అండగా నిలిచిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గౌరవం దక్కింది.ఇంట్లో మాత్రం తండ్రిగా తన బాధ్యతను మరువలేదు. చాలీచాలని జీతంతోనే కుమార్తెలు రజిత, స్వతంత్ర, ప్రియాంక, లావణ్యలకు మంచి చదువు చెప్పించి, వారి పెళ్లిళ్లు జరిపించి తన జీవిత ధ్యేయాన్ని నెరవేర్చారు. తన కష్టాలను పిల్లలకు తెలియనివ్వకుండా వారి భవిష్యత్తు కోసం జీవితాన్ని అంకితం చేశారు.తండ్రిని తలుచుకుంటూ కుమార్తెలు కన్నీరుమున్నీరయ్యారు. మా నాన్న సంపాదించింది డబ్బు కాదు.మనుషుల ప్రేమ. మాకు ఇచ్చింది ఆస్తులు కాదు చదువు, సంస్కారం, ఆత్మవిశ్వాసం. ఆయన లేని లోటు జీవితాంతం తీరదు. ఆయన చూపిన మార్గంలోనే నడవడం మా నిజమైన నివాళి అంటూ భావోద్వేగానికి గురయ్యారు.భార్య పింగిలి రాజ్యలక్ష్మితో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు నేడు దశదిన కర్మ నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి హాజరైన పలువురు గ్రామస్థులు, సహోద్యోగులు, కార్మిక నాయకులు శ్రీనివాస్‌రెడ్డి లాంటి సేవామూర్తులు అరుదు. తనకోసం కాకుండా ఇతరుల కోసం బతికిన మనిషిని ధర్మసాగర్ కోల్పోయింది. ఆయన సేవలు, మంచితనం, పోరాట స్ఫూర్తి ఎప్పటికీ చిరస్మరణీయమే అంటూ కన్నీటి పర్వతమయ్యారు.















# 66వ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటుకు కసరత్తు

**ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ లక్ష్యం గొర్రె కిరణ్‌కుమార్**





**హసన్‌పర్తి/ ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):**
గ్రేటర్ వరంగల్ 66వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఏర్పాటుకు సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు వెంకట్‌రాం రెడ్డి ఆదేశాల మేరకు 66వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొర్రె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో విజయ గార్డెన్‌లో సమావేశం జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, ఎస్సీ, బీసీ, మైనారిటీ విభాగాల ప్రతినిధులు పాల్గొని నూతన డివిజన్ కమిటీ ఏర్పాటుపై చర్చించారు. డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి పార్టీ తరఫున చేపట్టాల్సిన కార్యాచరణపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గొర్రె కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు చేరువగా పనిచేసే నాయకత్వానికే పార్టీ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. డివిజన్‌లో ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు ముందుంటుందని, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రార్థనల మధ్య రిత్విక్ జన్మదిన వేడుకలు

**దైవ సేవకుల ఆశీర్వచనాలు.. బైబిల్ సందేశం**



**తల్లాడ/ ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో నారపోగు ప్రసాద్ నివాసంలో రిత్విక్ జన్మదిన వేడుకలను మంగళవారం ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కుటుంబ ప్రార్థనలు నిర్వహించగా, దైవ సేవకులు సాల్మన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం పవిత్ర బైబిల్‌లోని దేవుని వాక్యాన్ని బోధిస్తూ రిత్విక్ దేవుని కృప, ఆశీర్వాదాలతో ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం చాట్ల కృష్ణార్జునరావుసుష్మ దంపతుల కుమారుడు రిత్విక్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి స్వీట్లు పంచుకొని ఆనందాన్ని పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో నారపోగు ప్రసాద్, రాణి, దైవ సేవకురాలు దీనమ్మ, జశ్వంత్, జోష్, అక్కమ్మ తదితరులు పాల్గొని రిత్విక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆశీర్వదించారు.

# శ్రీ చైతన్య పాఠశాలల్లో ఘనంగా పాఠశాల కౌన్సిల్ ఎన్నికలు.






**బయ్యారం,ఆగస్టు 4.(జర్నలిస్ట్ వార్త)**
శ్రీ చైతన్య పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థి కేబినెట్ ఎన్నికలు ఘనంగా నిర్వహించారు.విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఈ ఎన్నికలు ప్రతి ఏటా నిర్వహించడం ఆనవాయితీ అని ప్రిన్సిపాల్ షేక్ మదార్ అన్నారు.ఈ ఎన్నికల్లో హెడ్ బాయ్,హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్,డిప్యూటీ హెడ్ గర్ల్, సీసీఏ కెప్టెన్,స్పోర్ట్స్ కెప్టెన్ తో పాటు నాలుగు హౌస్ లకు కెప్టెన్లు,వైస్ కెప్టెన్లను విద్యార్థులు ఓటు వేసి ఎన్నుకున్నారు.స్కూల్ మొత్తాన్ని కింగ్స్,మొగల్స్, ఫ్యారోస్, సీజర్స్ అనే నాలుగు హౌస్ లుగా విభజించి ప్రతి హౌస్‌కు ఒక కెప్టెన్,ఒక వైస్ కెప్టెన్ ఉంటారు.ఎన్నికైన విద్యార్థి నాయకులు హెడ్ బాయ్ జితు వర్ధన్,హెడ్ గర్ల్ భవిష్య,డిప్యూటీ హెడ్ బాయ్ సైఫ్ ఖాన్,డిప్యూటీ హెడ్ గర్ల్ ధృవిత,స్పోర్ట్స్ కెప్టెన్ శ్రీథన్,సీసీఏ కెప్టెన్ హన్సిక మలాని,హౌస్ కెప్టెన్లు,కింగ్స్ హౌస్,కెప్టెన్ పియూష్,డిప్యూటీ కెప్టెన్ స్ఫూర్తి,సీజర్స్ హౌస్ కెప్టెన్ జిహబ్,డిప్యూటీ కెప్టెన్ సాహితి,ప్యారస్ హౌస్ కెప్టెన్ అనాస్,డిప్యూటీ కెప్టెన్ కార్తీకా రెడ్డి,మొడల్స్ హౌస్‌కెప్టెన్ హసనైన్,డిప్యూటీ కెప్టెన్ మనస్వి,ఈ కార్యక్రమంలో డీన్ విద్యాసాగర్,సి బ్యాచ్ ఇంచార్జ్ మల్లేశం, ప్రైమరీ పిపిటీ ఇంచార్జీలు ప్రవల్లిక,షహనాజ్, సిసిఏ ఇంచార్జ్ కుమారస్వామి, యాకయ్య,ఏవో సుధాకర్, ఉపాధ్యాయులు రామయ్య, భద్రు,షకీరా తదితరులు పాల్గొని గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.ఎన్నికైన నాయకులు స్కూల్ క్రమశిక్షణ, విద్య,క్రీడల్లో స్కూల్ పేరు ప్రతిష్టలు ఇనుమడింపజేస్తారని ప్రిన్సిపాల్ మదార్ ఆకాంక్షించారు. ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులను శ్రీ చైతన్య పాఠశాలల చైర్మన్ శ్రీధర్,డైరెక్టర్ శ్రీవిద్య,డీజీఎం చేతన్ మాధుర్ లు ప్రత్యేకంగా అభినందించారు.

# బాధిత కుటుంబాలకు మార్నేని రవీందర్‌రావు పరామర్శ



**ఐనవోలు/ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):** ఐనవోలు మండల కేంద్రంలో ఆవునూరి రమేష్, ఆవునూరి శంకర్‌ల తల్లి ఆవునూరి ఓదమ్మ మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే కొండేటి యాకయ్య తల్లి కోరుమల్లమ్మ మృతిపట్ల కూడా కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన వెంట గ్రామ ఉపసర్పంచ్ బరిగెల భాస్కర్, మాజీ సర్పంచ్ జన్ను కుమారస్వామి, నందనం సొసైటీ డైరెక్టర్ చింతబాబు, గడ్డం రమేష్, రహీం పాషా, ఏలియా సంపత్‌రెడ్డి, అఖిలబాబు, అనుముల రవి, శ్రీను, సమ్మయ్య, ఒంటిమామిడిపల్లి మాజీ ఎంపీటీసీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## భోగెల్లి నారాయణరావుకు ఘన నివాళి



**ఐనవోలు/ఆగస్టు 4(జర్నలిస్ట్ వార్త);**హన్మకొండ జిల్లా ఐనవోలు మండలంలోని పున్నేల్ గ్రామ మాజీ సర్పంచ్ భోగెల్లి నారాయణరావు దశదిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ పాల్గొన్నారు. ఆయన నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ మాజీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, హన్మకొండ జిల్లా ఉపాధ్యక్షుడు పోలేపల్లి బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు నకరగంటి మోహన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి సుధీర్, గ్రామ అధ్యక్షుడు ఇల్లందుల సారయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఇసుక మాఫియాను ప్రశ్నిస్తే ప్రాణహాని..?

### కలెక్టర్‌ను ఆశ్రయించిన యువకుడు.. సర్పంచ్ సహా పలువురిపై ఆరోపణలు

### విచారణ జరిపి రక్షణ కల్పించాలని వినతి






**పర్వతగిరి/హనుమకొండ బ్యూరో ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దూపతండా గ్రామపంచాయతీ పరిధిలోని ఆకేరు వాగులో అక్రమ ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోందని, దానిని అడ్డుకున్నందుకు తనపై బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్నారని దూపతండాకు చెందిన బానోత్ నవీన్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. పర్వతగిరి డిప్యూటీ తహశీల్దార్ హరితకు వినతిపత్రం అందజేసి తనకు న్యాయం చేయాలని కోరాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామ సర్పంచ్ ధరంసోత్ తిరుపతి, మాజీ ఉపసర్పంచ్ భూక్యా రాములు ఆధ్వర్యంలో ఆకేరు వాగు నుంచి నిబంధనలకు విరుద్ధంగా పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నారని ఆరోపించాడు. వందల ట్రాక్టర్ల ఇసుకను పల్లె ప్రకృతి వనం సమీపంలో నిల్వ చేశారని పేర్కొన్నాడు. ఈ అక్రమ రవాణాపై రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చినందుకు తనపై కక్ష పెంచుకున్నారని, పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అన్నారం గ్రామ సర్పంచ్ ఇంటి వద్ద పంచాయతీ పేరుతో పిలిపించి తనపై దాడి చేసి మొబైల్ ఫోన్ ధ్వంసం చేశారని, ఈ విషయం బయటకు చెప్పొద్దంటూ గుడిలో దేవుడిపై ప్రమాణం చేయించారని ఆరోపించాడు. అక్రమ ఇసుక రవాణాకు వినియోగిస్తున్న జేసీబీలు, ట్రాక్టర్లను వెంటనే స్వాధీనం చేసుకుని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తనకు ప్రాణరక్షణ కల్పించాలని కలెక్టర్‌ను వేడుకున్నాడు. ఇదిలా ఉండగా, ఫిర్యాదులో చేసిన ఆరోపణలపై సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాల్సి ఉంది. అక్రమ ఇసుక రవాణా ఆరోపణలపై జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

## వర్ధన్నపేట గిరిజన బాలికల హాస్టల్‌లో విద్యార్థుల పరామర్శ





**వర్ధన్నపేట/ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట గిరిజన బాలికల సంక్షేమ హాస్టల్‌లో ఆహారం కలుషితమై విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి వీర బిక్షపతి ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులను పరామర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాలికల హాస్టల్‌లో మహిళా వార్డెన్, మహిళా ప్రిన్సిపాల్ లేకపోవడంపై విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జన్ను సంతోష్ కుమార్, తెలంగాణ జాగృతి విద్యార్థి వరంగల్ జిల్లా అధ్యక్షుడు పోగుల సుతేజ్, విక్రమ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ భవిష్యత్తుకు పంట మార్పిడి అనివార్యం.

### -ఏడిఏ శ్రీనివాసరావు.





**బయ్యారం/,ఆగస్టు 4.(జర్నలిస్ట్ వార్త)**
జిల్లా వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.శ్రీనివాసరావు,మండల వ్యవసాయ అధికారి కే.రాజుతో కలిసి మంగళవారం బయ్యారం మండలంలో ప్రభుత్వం చేపడుతున్న పంటల వైవిధ్యీకరణ అవగాహన కార్యక్రమాల ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొత్తపేట, అల్లిగూడెం, కంబాలపల్లిలో ఎరువుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేసి,రైతులకు నాణ్యమైన ఎరువులు అందించాలని డీలర్లకు సూచించారు. అనంతరం అల్లిగూడెంలో ఆయిల్ పామ్,పత్తి, మొక్కజొన్నను అంతర పంటలుగా సాగు చేస్తున్న రైతులను అభినందించారు. ఒక ఎకరం బోడ కాకర వాణిజ్య పంటను విజయవంతంగా సాగు చేస్తున్న రైతు తోటను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. నారాయణపురం గ్రామంలో నువ్వులు,పత్తి,కంది అంతర పంటల సాగును పరిశీలించారు. రైతుల ఆదాయాన్ని పెంచే విధంగా పంటల వైవిధ్యీకరణను అవలంబించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలు,ఉద్యాన పంటలు,ప్రత్యామ్నాయ పంటల సాగుపై మరింత దృష్టి సారించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఫయాజ్, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ స్థాయిలో కాంగ్రెస్‌కు కొత్త ఊపు

### నాలుగు గ్రామాల్లో కమిటీల ఏర్పాటు.. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి శ్రీకారం








**వర్ధన్నపేట/ఆగస్టు 4 (జర్నలిస్ట్ వార్త):**
గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట మండలంలో సంస్థాగత పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టింది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మార్గదర్శకాలు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు సూచనల మేరకు మంగళవారం నల్లబెల్లి, రామవరం, కొత్తపెల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల్లో కొత్త గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై పర్యవేక్షణ, ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావడంలో గ్రామ కమిటీలు కీలకంగా పనిచేయాలని నాయకులు సూచించారు. ఈ సందర్భంగా కొత్తపెల్లి గ్రామ అధ్యక్షుడిగా తాళ్లపెల్లి యాదగిరి గౌడ్, వెంకట్రావుపల్లి అధ్యక్షుడిగా గొట్టం చిరంజీవి, నల్లబెల్లి అధ్యక్షుడిగా తాటికాయల దిలీప్, రామవరం అధ్యక్షుడిగా గజ్జెల రామచంద్రులను ఏకగ్రీవంగా ఎన్నుకొని బాధ్యతలు అప్పగించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎద్దు డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబిడీ రాజ్ రెడ్డి, ఐనవోలు టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రతి బాణుప్రసాద్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామెర ప్రశాంత్, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు మల్లెపాక సమ్మయ్య, నాయకులు మరుపట్ల సాయికుమార్, చిధుముల్ల భాస్కర్తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యం గెలిచింది,,,

### రాజకీయ సంస్కృతి మారాల్సిన సమయం ఆసన్నమైంది



భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతో ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే సర్వోన్నతులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారులనే సూత్రం రాజ్యాంగ స్ఫూర్తికి మూలాధారం. అయితే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం కావాలంటే రాజకీయ సంస్కృతి కూడా కాలానుగుణంగా పరిణామం చెందాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వివిధ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధుల పర్యటనల సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, అధికార యంత్రాంగం సమన్వయం వంటి అంశాలు చట్టబద్ధమైన అవసరాల మేరకు ఉండటం సహజమే. అయితే వాటిని మించి అనవసర ఆర్భాటం, ప్రచార హంగులు లేదా ప్రభుత్వ వనరుల వినియోగంపై ప్రజల్లో ప్రశ్నలు తలెత్తకుండా చూసుకోవడం ప్రజాస్వామ్య బాధ్యత. ప్రజా ధనం, ప్రభుత్వ సిబ్బంది సమయం ప్రధానంగా ప్రజా సేవలకే వినియోగించబడుతున్నాయనే విశ్వాసాన్ని ప్రభుత్వాలు నిరంతరం బలోపేతం చేయాలి.

ప్రజాప్రతినిధుల పనితీరును వారి కాన్వాయ్‌ల పరిమాణం, స్వాగత సభలు లేదా ప్రచార కార్యక్రమాల ద్వారా కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు, పారదర్శక పరిపాలన, చట్టబద్ధమైన నిర్ణయాలు, ప్రజా ధన వినియోగంలో బాధ్యత వంటి ప్రమాణాల ఆధారంగా అంచనా వేయడం ప్రజాస్వామ్యానికి మేలు చేస్తుంది. ప్రపంచంలోని పలు ప్రజాస్వామ్య దేశాలు నిరాడంబరత, జవాబుదారీతనం, పారదర్శకత, సమర్థ పరిపాలన, పరిశోధనలకు ప్రోత్సాహం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ప్రతి దేశానికి తనదైన రాజకీయ, సామాజిక, చారిత్రక నేపథ్యం ఉన్నప్పటికీ, ప్రజా ప్రయోజనానికి ఉపయోగపడే ఉత్తమ పరిపాలనా విధానాలను అధ్యయనం చేసి భారత పరిస్థితులకు అనుగుణంగా అమలు చేయడం ఎల్లప్పుడూ స్వాగతించదగిన విషయమే.

రాజకీయాల్లో వ్యక్తుల కంటే సంస్థలకు, ప్రచారం కంటే విధానాలకు, నినాదాల కంటే ఫలితాలకు ప్రాధాన్యం పెరగడం ప్రజాస్వామ్య నాణ్యతను పెంచుతుంది. అదే సమయంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రత, అధికారుల నిష్పాక్షిక విధి నిర్వహణ, ప్రజా ధన పరిరక్షణ వంటి విలువలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. భారత రాజ్యాంగం సమానత్వం, జవాబుదారీతనం, చట్ట పరిపాలన, ప్రజా సంక్షేమం వంటి విలువలను ప్రతిష్ఠించింది. ఆ విలువలకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు నిరాడంబరత, బాధ్యత, పారదర్శకతతో వ్యవహరిస్తే ప్రజల్లో ప్రభుత్వాలపై విశ్వాసం మరింత పెరుగుతుంది. ప్రజలు కూడా వ్యక్తి ఆరాధనకు బదులుగా పనితీరు, విధానాలు, ప్రజా ప్రయోజనం ఆధారంగా నాయకత్వాన్ని అంచనా వేయడం ప్రజాస్వామ్య పరిపక్వతకు సూచికగా నిలుస్తుంది. ప్రజాస్వామ్యం ఎన్నికలతో మాత్రమే పరిమితం కాదు. ఎన్నికల తర్వాత కూడా జవాబుదారీతనం, నైతికత, చట్టబద్ధ పరిపాలన, ప్రజా ప్రయోజనాల పరిరక్షణ నిరంతరం కొనసాగినప్పుడే ప్రజాస్వామ్య స్ఫూర్తి సార్థకమవుతుంది. భారత ప్రజాస్వామ్యం మరింత బలపడాలంటే రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు, అధికారులు, పౌర సమాజం అందరూ రాజ్యాంగ విలువలను ఆచరణలో ప్రతిబింబించే రాజకీయ సంస్కృతిని నిర్మించేందుకు కలిసి కృషి చేయాల్సిన అవసరం ఉంది.



జర్నలిస్ట్ వార్త సి ఈ ఓ, ఎడిటర్, సీనియర్ జర్నలిస్ట్
**బిర్రు కరుణాకర్**